క్లుప్తంగా

ప్రతీ విద్యార్థి అన్ని రంగాల్లో రాణించాలి



కో–ఆర్డినేటర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

జగిత్యాల: ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో రాణించాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ అన్నారు. శనివారం డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహేంద్ర ప్రైడ్ క్లాస్‌రూమ్ ట్రెనింగ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో నైపుణ్యం సాధిస్తే ఉద్యోగాలు వస్తాయన్నారు. అనంతరం టాస్క్ ట్రెనర్ అమూల్యను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నీరజ, వరప్రసాద్, లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి



సంగెంలో ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కోరుట్ల రూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మండలంలోని సంగెంలో ఇందిరమ్మ గ్రామ కమిటీ ఎంపిక చేసిన లబ్ధిదారుల ఇళ్లను శనివారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపిక అనంతరం జాబితాను విడుదల చేసి గ్రామపంచాయితీ నోటీస్ బోర్డుపై ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పోతుగంటి శంకర్, ముంజ రాజం, కారొబార్ అనిల్ పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

మల్లాపూర్: గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించి ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని ఎంపీడీవో శశికుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని సాతారంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరుని పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగంగా పూర్తిచేయాలన్నారు. మండలానికి ప్రభుత్వం 711 ఇళ్లు కేటాయించిందని, ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలి

పెగడపల్లి: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. మండలంలోని బతికపల్లిలో శనివారం పర్యటించి ఇళ్ల లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. ఇంటి నిర్మాణం ప్రారంభించి బేస్‌మెంట్ వరకు పనులు పూర్తయితే మొదటి విడత నిధులు నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం చేసుకోవాలని ఇందుకు పలు దఫాలుగా రూ. 5 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నిఖిల్‌రెడ్డి, కారొబార్ మధు ఉన్నారు.

ఎన్నారై పాలసీతో గల్ఫ్ కార్మికులకు ప్రయోజనం



నర్సింగరావును సన్మానిస్తున్న జిల్లా వాసులు

మెట్‌పల్లి: ఎన్నారై పాలసీతో గల్ఫ్ కార్మికులకు మేలు జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. దుబాయ్ పర్యటనలో భాగంగా శనివారం ఆయన అక్కడ జిల్లాకు చెందిన కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వస్తున్న తెలంగాణవాసులను ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నారై పాలసీని రూపొందించిందని తెలిపారు. కార్మికులు సమస్యల పరిష్కారం సమష్టిగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కొట్టాల సత్యనారాయణ, సుతారి సత్యం, రాజు, మనోజ్ తదితరులున్నారు.

రైతులకు అందుబాటులో వేబ్రిడ్జి

జగిత్యాలఅగ్రికల్చర్: చల్‌గల్ మామిడి మార్కెట్‌లో వేబ్రిడ్జిని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మార్కెట్ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. మామిడి మార్కెట్‌కు మామిడి కాయలు తీసుకువచ్చిన రైతులకు ఉచితంగా వేబ్రిడ్జిపై తూకం వేయనున్నట్లు తెలిపారు. వ్యాపారస్తులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీ ఎప్పుడో?

- అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 63, హెల్పర్ పోస్టులు 318 ఖాళీ
- ఖాళీలున్న చోట ఇన్‌చార్జీలే దిక్కు
- పని భారంతో అంగన్‌వాడీల ఇబ్బంది



అయితుపల్లి అంగన్‌వాడీ కేంద్రం–1లో చిన్నారులతో హెల్పర్

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్కన ఉన్న కేంద్రాల టీచర్లకు అప్పగించడంతో వారిపై అదనపు భారం పడుతోంది. ఆయాలు లేని కేంద్రాల్లో టీచరే అన్ని పనులు చేయాల్సి వస్తోంది. జిల్లాలో అంగన్‌వాడీల పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారోనని అర్హులు ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1065 అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. ఇటీవల టీచర్ల ఖాళీలున్న చోట్ల పలు కేంద్రాల్లో అర్హత గల హెల్పర్లను ప్రమోట్ చేసి టీచర్ పోస్టులను భర్తీ చేశారు. జిల్లాలో 63 టీచర్, 318 హెల్పర్ల పోస్టులు ఖాళీలున్నాయి. రెండు, మూడేళ్లుగా ఖాళీగా ఉన్నా.. పోస్టులు భర్తీలో జరుగుతున్న జాప్యంతో ఆయా కేంద్రాల పరిధిలోని ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. దీంతో సకాలంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందించాలంటే ఇన్‌చార్జీలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. టీచర్లు లేని కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు సలహాలు, సూచనలు సరిగా అందడం లేదన్న విమర్శలున్నాయి.

పనిభారంతో సతమతం

అంగన్‌వాడీ సెంటర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నడుస్తాయి. వేసవి కాలంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నడుస్తాయి. కానీ అంగన్‌వాడీ టీచర్ల పని ఆ సమయానికి పరిమితం కావడం లేదు. ఇంటికి వెళ్లాక కూడా గంటలకొద్ది పని చేయాల్సి వస్తోంది. దీంతో పనిభారం తట్టుకోలేక వారు సతమతమవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సరుకులు, గర్భిణులు, బాలింతలు, పిల్లల హాజరుతో పాటు వారికి సరుకులు అందించిన వివరాలు గృహ సందర్శన తదితర వివరాలన్నీ నమోదు చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లు రిజిష్టర్లు ఉపయోగిస్తున్నారు.గత ప్రభుత్వం అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్లు ఇచ్చింది. ఈ ఫోన్లలో సుమారు 10 వరకు యాప్‌లు పొందుపరిచారు. రిజిష్టర్లలో, ఈ యాప్‌లో కూడా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ సెంటర్లలో క్షణం తీరిక లేకుండా పనిచేసే టీచర్లకు అదనపు పని భారంగా మారింది. ఇంటికెళ్లాక తాము ఇంటి పనులు కూడా చేసుకోలేక పోతున్నామని వారు వాపోతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఖాళీలు

- జగిత్యాల పరిధిలో 18 టీచర్, 97 హెల్పర్లు
- ధర్మపురి పరిధిలో 19 టీచర్, 86 హెల్పర్లు
- మెట్‌పల్లి పరిధిలో 14 టీచర్, 86 హెల్పర్లు
- మల్యాల పరిధిలో 12 టీచర్, 49 హెల్పర్లు

త్వరలో భర్తీ చేస్తాం



పోస్టులు ఖాళీలున్న కేంద్రాల్లో ఇన్‌చార్జీలను నియమించాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టుల ఖాళీల వివరాలను ఉన్నతాధికారులను నివేదించాం. త్వరలో వీటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నోటిఫికేషన్ జారీ చేస్తాం. అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు అర్హత డిగ్రీ, హెల్పర్‌కు ఇంటర్ అర్హతగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది.

బోనగిరి నరేశ్,
జిల్లా సంక్షేమ శాఖ అధికారి



జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లి గ్రామ శివారులో ప్రధాన రహదారి వెంట మిషన్ భగీరథ పైప్ పగిలి నీరు వృథాగా పోతోంది. దీంతో పెర్కపల్లి, హన్మాజీపేట, బాలపల్లి, పొరండ్ల గ్రామాలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, గతంలో వేసిన పైప్‌లైన్ నాణ్యత ప్రమాణాలు లేకపోవడంతో నెల రోజుల్లో మూడుచోట్ల పైపులు పగిలి నీరు వృథాగా పోయింది. ఇప్పటికైనా మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: రాజశేఖర్
ఏఈఈ, మిషన్ భగీరథ సెల్ నంబర్: 6309954486

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పహల్గాం మృతులకు నివాళి



చిన్నమెట్‌పల్లిలో యువజన సంఘాల నివాళి



నివాళి అర్పిస్తున్న పెంబట్ల- కోనాపూర్ గ్రామస్తులు

కోరుట్ల/కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల తూటాలకు బలైన మృతులకు యువజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి క్రొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యతిరాజం నర్సయ్య, ఈవో విక్రం, పూజారి బీర్నంది నర్సింహాచారి, చిన్న మెట్‌పల్లి యువకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: చిట్టాపూర్‌లో ఏకల్ అభియాన్ ఆధ్వర్యంలో పెహల్గాం మృతులకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త గణపతి విష్ణువర్ధన్‌రాజ్, నాయకులు రాజు, మహిళలు గాండ్ల లత, లక్ష్మి, చిన్నారులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పహల్గామ్ మృతులకు పట్టణంలోని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, నాయకులు ఖుత్బొద్దీన్, అందె మారుతి, రుత్త నారాయణ, అందె మారుతి, సాగర్, జాఫర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: పెహల్గం ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి మండలంలోని పెంబట్ల–కోనాపూర్ గ్రామస్తులు దుబ్బరాజన్న ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి గ్రామస్తులు కొవ్వొత్తులతో ఘనంగా నివాళి అర్పించారు.

రాయికల్: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గమ్‌లో యాత్రికులపై ఉగ్రదాడిలో మృతిచెందిన అమరులకు శనివారం రాత్రి రాయికల్ మండలం ఇటిక్యాలలో గ్రామ సేవా సమితి అధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



క్రీడాకారులతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల పట్టణ ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల మైదానంలో టీచర్స్ క్రికెట్ లీగ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడల ప్రోత్సాహానికి బడ్జెట్లో రూ 500కోట్లు కెటాయించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, నాయకులు దామోదర్‌రావు, తోట మల్లికార్జున్, కూసరి అనిల్, డిష్ జగన్, పంబాల రాము, శ్రీధర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతోనే ఆపరేషన్లు

జగిత్యాల: సేవా దృక్పథంతోనే ఆపరేషన్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం పావని కంటి ఆస్పత్రిలో నిరుపేదలకు ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేశారు. నిరుపేదలకు ఉచితంగా కంటి శస్త్రచికిత్స చేసి మందులు అందిస్తామని తెలిపారు. ఆయన వెంట డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

ఫార్మసీ ఆఫీసర్లుగా పేరు మార్పుపై హర్షం

కోరుట్ల: ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా పేరు మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల టీజీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలువేరి ఉదయ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా పేరు మారుస్తూ జీఓఎంఎస్ నెం 71 హెల్త్ ,మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, హెల్త్ మినిస్టర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజీవ్ యువవికాసం దరఖాస్తులు సమర్పించాలి

సారంగాపూర్: రాజీవ్ యువ వికాసం కింద లబ్ధిపొందడానికి ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తుల కాపీలను వెంటనే మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువవికాసంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న యువకులు మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించిన కాపీలపై ఆయన సమీక్షించారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డుపై వైఖరి ప్రకటించాలి



మాట్లాడుతున్న ఉద్యమకారులు

జగిత్యాలటౌన్: బీఆర్ఎస్ రజతోత్సవ సభలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేసీఆర్ తన వైఖరి స్పష్టం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల పోరం జగిత్యాల జిల్లా చైర్మన్ జవ్వాజి శంకర్ డిమాండ్ చేశారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టఫ్) కార్యాలయంలో ఉద్యమకారుల ఫోరం సమావేశంలో మాట్లాడారు. ఉద్యమంలో తమ విలువైన సమయాన్ని రాష్ట్ర సాధన కోసం కొట్లాడి అనేక కేసులు, నిర్బంధాలు ఎదుర్కొన్న ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ అంశం చేర్చాలని కోరినప్పటికీ బీఆర్ఎస్ ఇప్పటి వరకు తన వైఖరి తెలపలేదన్నారు. రజతోత్సవ సభలో తమ వైఖరి తెలపాలని కోరారు. కార్యక్రమంలో తన్నీరు సత్యం, రాగుల రాజు, లింగారెడ్డి, నాచుపల్లి రెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వైకుంఠధామంలో వసతులు కరువు



సెల్‌ఫోన్ వెలుగులో అంత్యక్రియలు

వెల్గటూర్: మండల కేంద్రంలోని వైకుంఠధామంలో కనీస వసతులు కరువయ్యాయి. శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందడంతో రాత్రి అంత్యక్రియలకు తీసుకెళ్లారు. అయితే వైకుంఠధామంలో కనీసం విద్యుత్‌దీపాలు లేకపోవడంతో సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం స్నానాలకు నీటి సదుపాయం కూడా లేకపోవడంతో ట్యాంకర్ తెప్పించి స్నానాలు చేశారు. అంత్యక్రియలకు వచ్చిన వారంతా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బంద్ ప్రశాంతం



వెల్గటూర్‌లో మూసివేసిన దుకాణాలు

మల్లాపూర్ : జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడులను నిరసిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన మల్లాపూర్ మండల బంద్ ప్రశాంతంగా ముగిసింది. కిరాణ దుకాణాలు, హోటళ్లు, మెడికల్ షాప్‌లు, బెకరీలు, పర్టిలైజర్ షాపులతో పెట్రోల్ బంక్, వైన్ షాపులతో పాటు పలు వాణిజ్య దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు.

వెల్గటూర్: వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఉదయం నుండే వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూసివేసి స్వచ్ఛందంగా బంద్ పాటించారు.

కథలాపూర్: పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా కథలాపూర్ మండల కేంద్రంలో శనివారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. దుకాణాల యజమానులు, హోటళ్ల స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ప్రధానరోడ్డులో హిందూ ఐక్య వేదిక నాయకులు, యువకులు ర్యాలీ తీశారు.

పెగడపల్లి: పెగడపల్లిలో బీజేపీ, విశ్వంహిందూ పరిషత్, బీసీ సంక్షమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ ప్రశాంతమైంది. నాయకులు బైక్‌లపై తిరుగుతూ దుకాణాలు, హోటళ్లు, వాణిజ్య సంస్థలు మూసి వేయించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద మృతులకు సంతాపం తెలిపి మౌనం పాటించారు.

శ్మశానవాటిక భూమిని కాపాడండి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న గోసంగి నాయకులు

జగిత్యాలటౌన్: రాయికల్ మండల కేంద్రంలోని ఎర్రకుంట సమీపంలోని శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని శనివారం గోసంగి యువజన సంఘం ప్రతినిధులు జగిత్యాల ఆర్డీవో పులి మధుసూధన్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయికల్‌లోని ఎర్రకుంట సమీపంలో సర్వేనంబర్ 740 లోని 15గుంటల స్థలాన్ని గోసంగి కుల పెద్ద మనుషులు 1990లో కొనుగోలు చేసి ఆ స్థలాన్ని శ్మశానవాటిక కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. గత 35 ఏళ్లుగా శ్మశానవాటిక వినియోగిస్తున్నామని తెలిపారు. సదరు స్థలం తనదంటూ జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జగిత్యాల ఆర్డీవో, తహసీల్దార్లకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిసిందన్నారు. 35ఏళ్ల క్రితం స్థల యజమాని నుంచి కొనుగోలు చేసిన ఆ స్థలంలో తమ కుల స్థుల గోరీలు కూడా ఉన్నాయని తెలిపారు. దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నేరెల్ల వినోద్‌కుమార్, సందెల అభిలాష్, కూచనపెల్లి మహేందర్, కలమడుగు పెద్ద నర్సయ్య, రమేశ్ తదితరులు ఉన్నారు.

భారత్ సమ్మిట్‌లో ప్రభుత్వ విప్

ధర్మపురి: హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన శిఖరాగ్ర సమావేశంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు చోటు దక్కింది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన భారత్ సమ్మిట్ 2025కు ఇది మైలురాయి ప్రపంచ సమావేశం. రెండు రోజుల పాటు జరిగిన శిఖరాగ్ర సమావేశానికి 100 కు పైగా దేశాల నుంచి 450 కి పైగా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో సుమారు 100 మంది ప్రగతిశీల రాజకీయ పార్టీల ప్రతినిధులు, 50 మంది వరకు మంత్రులు, 50 మంది వరకు పార్లమెంటు సభ్యులు, సెనెటర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యార్థులను అప్రమత్తం చేయాలి

జగిత్యాలరూరల్: వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామాల్లో ఉన్న కెనాల్స్, చెరువులు, కుంటలు, నదుల వద్దకు ఈతకు వెళ్లి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, దీనిని అరికట్టేందుకు ప్రతి గ్రామంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మైకుల ద్వారా ప్రచారం చేయించాలని గురుకులాల రాష్ట్ర పేరెంట్స్ కమిటీ సభ్యులు గోరుమంతుల సురేందర్ శనివారం జిల్లా పంచాయతీ అధికారి మధుసూదన్‌కు వినతిపత్రం సమర్పించారు. తెలిసి తెలియక చాలా మంది విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియకుండా చెరువులు, కుంటలు, వాగుల్లోకి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని, దీంతో వారి కుటుంబాల్లో చాలా మంది బాధపడే పరిస్థితి నెలకొంటుందని, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉదయం, సాయంత్రం వేళల్లో మైకుల్లో ప్రచారం చేయించడంతో పాటు, చెరువులు, కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించాలని కోరారు.

రాష్ట్ర ర్యాంకర్‌కు గ్రామస్తుల సన్మానం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన కొల్లూరు ప్రణతి ఇంటర్‌మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించడం గ్రామానికి గర్వకారణమని గ్రామస్తులు అన్నారు. తుంగూర్ గ్రామానికి చెందిన కొల్లూరి ప్రభాకర్–జయ దంపతుల కూతురు ప్రణతి ఇటీవల వచ్చిన ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో 994 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు రావడంపై శనివారం గ్రామంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

ఐదు శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి: ఈ నెల 30లోపు ఆస్తి పన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మోహన్ శనివారం తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని ఆయన కోరారు.

నిరుపేద విద్యార్థికి పూర్వ విద్యార్థుల చేయూత

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కొడిమ్యాల రిచిత అనే నిరుపేద విద్యార్థినికి అదే పాఠశాలలోని 2002–23 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి రిచిత విద్యాభ్యాసం కోసం అయ్యే ఖర్చులు శనివారం ఎస్సై సుధీర్‌రావు చేతుల మీదుగా, మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్, డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28న వాహనాల వేలం

జగిత్యాలక్రైం: ఎక్సైజ్ శాఖకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 28న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు ధరూర్ క్యాంప్ కార్యాలయంలో జరిగే బహిరంగ వేలంలో హాజరు కావాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



జగిత్యాల: పేదలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని మెడికవర్ ఆస్పత్రి నిర్వాహకుడు గుర్రం కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హన్మాజీపేటలో శనివారం పెరిక కుల సంఘం సభ్యులకు వైద్య శిబిరం నిర్వహించారు .ఈ సందర్భంగా 120 మందికి షుగర్, బీపీ, 2ఈకో పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కుల సంఘం అధ్యక్షుడు మహేశ్, సుధాకర్, రాకేశ్ పాల్గొన్నారు.



విద్యార్థుల జోష్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నరేశ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఉద్యోగం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.